క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



వెంకటాపురం(కె): మండల పరిధిలని యాకన్న గూడెం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చేయూత నిచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యురాలు రాణికి రూ.5000 నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అగ్ని బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిలని అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సభ్యులు సమ్మయ్య, శ్రీను, భాస్కర్, రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



పలిమెల: గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పలిమెల ఎస్సై తమాషారెడ్డి తెలిపారు. ఎస్సై తమాషారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తెలిసిన సమాచారం మేరకు మహదేవ్‌పూర్ సీఐ రాజేశ్వరరావు ఆదేశాలతో శుక్రవారం మండలంలోని పంకేన గ్రామానికి చెందిన పాగే రాజును అదుపులోకి తనిఖీ చేయగా అతడి వద్ద 3500 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. అతడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు వెల్లడించారు. వేసవి సెలవుల కావడంతో పిల్లల కదలికలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని లేదంటే గంజాయి, తదితర వ్యసనాలకు బానిసలుగా మారే ప్రమాదం ఉందని ఎస్సై సూచించారు.

కోరం లేకపోయినా.. సభ కొనసాగింపు



టేకుమట్ల: కోరం లేకున్నా మండల కేంద్రంలో మండల సభను శుక్రవారం కొనసాగించారు. తొమ్మిది మంది ఎంపీటీసీలకు గాను ముగ్గురు ఎంపీటీసీలు ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, ఎంపీటీసీ పింగిలి వెంకటేశ్వర్ రెడ్డి మాత్రమే హాజరు కాగా పూర్తి స్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కాకున్నప్పటికీ సభను కొనసాగించారు. మండలంలోని ప్రజా సమస్యలను వివరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు లేకున్న మండల సభ కొనసాగింపుపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ అనిత, ఎంపీఓ సురేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ములుగు రూరల్: విధి నిర్వహణలో భాగంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆశవర్కర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, ఉపాధ్యక్షుడు గుండబోయిన రవిగౌడ్, ఆశవర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రత్నం నీలాదేవి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రానికి చెందిన ఆశ కార్యకర్త లీలావతి విధి నిర్వహణలో భాగంగా డెలివరి కేసు ఉండటంతో నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి 108వాహనంలో తీసుకొని వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపారు. ఆశ కార్యకర్త కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సాయం కింద రూ.50 వేలు అందించాలని, రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియ అందించాలని డిమాండ్ చేశారు.

ఆటో ఢీ.. వృద్ధుడి మృతి

కాటారం: ట్రాలీ ఆటో ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ధన్వాడ గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టంపేట వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ధన్వాడకు చెందిన ఆతుకూరి మల్లయ్య (75) పనుల నిమిత్తం ధన్వాడ–కాటారం ప్రధాన రహదారి వెంట నడుచుకుంటూ కిష్టంపేట వెళ్తున్నాడు. ఈ క్రమంలో గంగారం వైపు నుంచి వచ్చిన ట్రాలీ ఆటో ఢీకొట్టింది. ఆటో కొంత దూరం ఈడ్చుకొని వెళ్లగా మల్లయ్య తీవ్రగాయాపాలై కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ పరారైనట్లు తెలిసింది. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందనట్లు తెలిపారు.

వేటగాళ్ల ఉచ్చులో వన్యప్రాణులు

- నీటి తావులే.. మృత్యు కేంద్రాలు
- పట్టించుకోని అధికారులు

మహాముత్తారం: వేసవికాలం వచ్చిందటే చాలు వేటగాళ్ల ఉచ్చులో వన్యప్రాణులు విలవిలలాడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. వేసవి కాలంలో వాగులు వంకలు ఎండిపోయి ఎక్కడో ఒక చోట నీటి నిలవలు ఉన్న వద్దకు వన్యప్రాణులు కేవలం నీటి ఆనవాళ్లను వాసన ద్వారానే పసిగట్టి దాహం తీర్చుకోవడానికి వస్తోంటాయి. ఇదే అదునుగా భావించిన వేటగాళ్లు ఆ నీటి ఆనవాళ్ల చుట్టూ ఉచ్చులు బిగించి వాటిని కిరాతంగా హతమార్చి మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మహాముత్తారం, పలిమెల, మహదేవపూర్, మల్హర్, భూపాలపల్లి తదితర మండలల్లోని అడవుల్లో దుప్పులు, అడవిపందులు, అడవిదున్నలు, కంజు, మచ్చల దుప్పితోపాటు అనేక రకాలకు వన్యప్రాణులు మనుగడను సాగిస్తున్నాయి. వానాకాలం, చలికాలంలో ప్రకృతి పరంగా లభించిన పచ్చని గడ్డి, ఆకులను తింటూ ఆనందంగా గడిపే వన్యప్రాణులు ఏప్రిల్, మే మాసం వచ్చిందంటే బతుకడమే సమస్యగా తయారవుతోంది. అడవుల్లోని వాగులు వంకలు ఎండిపోయి ఎక్కడో ఒక చోట నీరు నిల్వ ఉంటుంది. దీనిని పసిగట్టిన వేటగాళ్లు అడవుల్లోని వన్యప్రాణి దప్పిక తీర్చుకునేందుకు ఎలాగు నీటి మడుగుల వద్దకు వస్తాయని భావించి వాటిని హతమార్చేందుకు నీటి అడ్డాలను ఎంచుకొని స్మగ్లర్లు మృత్యు కేంద్రాలుగా మారుస్తున్నారు. వన్యప్రాణుల రక్షణ కోసం వన్యప్రాణి సంరక్షణ చట్టం పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో వేటగాళ్లు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. చట్టాన్ని కఠినంగా అమలుచేసి వేటగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అటవీశాఖ అధికారులు చోద్యంచూస్తూ కాలం గడుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పల్లెలతో పాటు పట్టణాల్లో వేట మాంసానికి విపరీతమైన డిమాండ్ ఉండటంతో వేటగాళ్లు వేసవి కాలంలో యథేచ్ఛగా వన్యప్రాణులను హతమర్చి సొమ్ము చేసుకుంటున్నారు. నీళ్ల తావుల వద్దకు వచ్చే వన్యప్రాణులను చంపే వేటగాళ్లపై అటవీశాఖ అధికారులు దాడి చేసి వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.



అటవీప్రాంతంలో నీళ్లు తాగుతున్న వన్యప్రాణి(ఫైల్)

నిఘా ఏర్పాటు చేశాం..

నీటి స్థావరాల వద్దకు వచ్చే వన్యప్రాణులను ఉచ్చులతో వేటాడే వేటగాళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఉచ్చులు వేసి వన్యప్రాణులను వేటాడిన పలువురిపై ఇప్పటికే అటవీ హక్కుల చట్టం ప్రకారం కేసు నమోదు చేశాం. ఎవరైనా ఇక నుంచి ఉచ్చులు అమర్చుతున్నట్లు తమ దృష్టికి వస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– వెంకటేశ్వర్‌రావు,
ఇన్‌చార్జ్ రేంజర్ పెగడపల్లి

‘అగ్నిపథ్’తో యువతకు నష్టం

భూపాలపల్లి అర్బన్: భారత సాయుధ దళాల్లో పని చేయాలనుకునే యువకులకు అగ్నిపథ్‌తో తీరని నష్టం జరిగిందని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, జిల్లా ఇన్‌చార్జ్ సూర చందన రెడ్డి ఆరోపించారు. యువ ఫ్యాన్స్ న్యాయ యాత్ర ఐదు హామీల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా చందన రెడ్డి హాజరై మాట్లాడారు. 10 ఏళ్ల మోదీ పాలనలో యువకులకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని కనీసం 10లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలించిపి అధికారంలోకి తీసుకువస్తే అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేస్తుందని తెలిపారు. యువకుల కోసం ఐదు గ్యారంటీలను ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినట్లు వివరించారు. ఈ సమావేశంలో నాయకులు సురేష్, ప్రేమ్‌కుమార్, సరోవరం, అఖిల్, అనురాగ్, తిలక్, మహేందర్, సాయి, విగ్నేష్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చందనరెడ్డి

కడియం కావ్యను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

భూపాలపల్లి అర్బన్: వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీస్తున్న ఇండియా కూటమి అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈడీ, ఐటీ, సీబీఐలను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీల నాయకులను లొంగతీసుకోడం, లొంగని వారిపై అక్రమ కేసులు పెట్టి జైల్‌కు పంపిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చి వాగ్దానాలను అమలు చేయలేదన్నారు. జీరో అకౌంట్ ద్వారా రూ.15లక్షల ఇస్తామని, రెండు కోట్లు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మోసం చేశారని మండిపడ్డారు. భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి మనధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. బీజేపీని ఓడించి మతోన్మాదాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మోజారిటీలో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు రాజయ్య, రమేష్, మహేందర్, శేఖర్, శ్రీధర్, లక్ష్మి, రజిని, గోవర్ధన్, నరేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు నష్టం

చిట్యాల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటి చేస్తున్న సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ.. శుక్రవారం మండలంలోని పాశిగడ్డతండాలో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుడు, నిజాయతీ పరుడైన సుధీర్ కుమార్‌ను ప్రజలు అదరించి గెలిపించాలని అన్నారు. కల్లిబొల్లి మాటలతో మోసపూరితమైన వాగ్దానాలను చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తెలంగాణ వచ్చిన తర్వాత 24 గంటలు పాటు కరెంట్ అందించడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను కొనసాగించి అన్ని పాంత్రాలకు సాగు, తాగు నీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని మోసం చేసిన కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యను, బీజేపీ నుంచి వచ్చిన అరూరి రమేష్‌ను ప్రజలు చిత్తు చిత్తుగా ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా, మండల నాయకులు చింతల రమేష్, దొడ్డె శంకర్, లెంకల రాజిరెడ్డి, నరసింహారావు, రమేష్, ఉప్పుల కిరణ్, రాజ్‌కుమార్, గురుకుంట్ల కిరణ్, భయగాని గణపతి, భద్రు నాయక్, రవీందర్, బొట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సిరికొండ

గర్భిణులకు వైద్య సేవలు



మందులను పంపిణీ చేస్తున్న సిబ్బంది

వాజేడు: మండల పరిధిలోని మొరుమూరు కాలనీ, బొల్లారం గ్రామాల్లో మాతా శిశు సంరక్షణ వైద్యాధికారిణి యోషిత ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులు ఇవ్వడంతో పాటు వేసవి ఎండల దృష్ట్యా పలు సూచనలను చేశారు. వీరితో పాటు బాలింతలను కూడా పరీక్షించి మందులను అందజేశారు. క్షయ వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి మందులు ఉన్నది లేనిది అడిగి తెలుసుకుని లేని వారికి పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో కోటిరెడ్డి, ఏఎన్‌ఎమ్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

మొగుళ్లపల్లి: దేవతల ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని పిడిసిల్ల గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు, పాత ఇస్సిపేట గ్రామంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మతల్లి గుడి నిర్మాణం కోసం ఐదు గుంటల భూమితో పాటు ఐదు లక్షల విరాళం అందజేసిన మాజీ ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు జోరుక సదయ్య, నాయకులు చదువు అన్నారెడ్డి, నైనకంటి ప్రభాకర్ రెడ్డి, కోడారి రమేష్‌యాదవ్, ముడుపు రవి, నేర్పటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పూజ కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

పలిమెల: రోజురోజుకు పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా వేసవికాలంలో ఎండబారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ పూనెం రామారావు సూచించారు. మండలలోని పంకెన సబ్‌సెంటర్ పరిధిలోని లెంకలగడ్డ గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ.. ఎండ తీవ్రత అధిక ఉండే మధ్యాహ్నం సమయంలో బయటికి రావద్దని, చల్లని నీరు, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నవజాత శిశువులు, చిన్నపిల్లలను ఎండ వేడి నుంచి జాగ్రత్త చూసుకోవాలని, వడగాలి తగలకుండా పిల్లలను నీడ ప్రదేశంలో చల్లటి గాలికి ఉంచాలన్నారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకొని, చికిత్స తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగలినట్లు అనిపిస్తే వెంటనే సమీప ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాత శిశు సంరక్షణ సూపర్‌వైజర్ నిర్మల మేరీ, ఏఎన్ఎం శ్రీలత, ఆశా నిర్మల పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రామారావు

ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్

వెంకటాపురం(కె): పోలింగ్ కేంద్రాల వారిగా పోలింగ్ స్లిప్‌లను పంపిణీ చేయాలని తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బూత్ లెవల్ అధికారుతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బూత్ లెవల్ అధికారులు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం

చిట్యాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం లభిస్తుందని తహసీల్దార్ ఖాజా మోహియొద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే (స్కూల్ డే) కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, తహసీల్దార్ ఖాజా మోహియొద్దీన్ హాజయ్యారు. ఈ సందర్భంగా జయప్రద మాట్లాడుతూ.. జూన్ 2023 నుంచి ఏప్రిల్ 24 వరకు పది నెలల కాలంలో ఆరు అంశాల ద్వారా నేర్చుకున్న కార్యక్రమాలపై పిల్లలకు స్టార్ గుర్తులు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల పిల్లల వరకు ప్రైవేటు పాఠశాలలో వేయకుండా అంగన్‌వాడీ కేంద్రానికి పంపిస్తే అందులో ప్రభుత్వం నుంచి వచ్చే పౌష్టికాహారం అందుతుందన్నారు. దీంతో పిల్లలు ఆరోగ్యపరంగా ఎదుగుతారని తెలిపారు. ఈ సంవత్సరం కలెక్టర్ భవేష్‌మిశ్రా సొంత భవనాలు కలిగిన కేంద్రాలకు ఆట వస్తువులు, టీవీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.రాంచందర్ రావు, అంగన్‌వాడీ టీచర్లు చింతల సంధ్యారాణి, సుజాత, పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో తహసీల్దార్

ఇంటర్ విద్యార్థులకు సన్మానం



కాటారం: సన్మానిస్తున్న ముస్లిం మత పెద్దలు



రేగొండ: సన్మానిస్తున్న మనోహర్‌రావు

కాటారం: కాటారం మండలం నుంచి అత్యధిక మార్కులు సాధించిన ముస్లిం విద్యార్థులను శుక్రవారం మండల కేంద్రంలోని ముస్లిం మత పెద్దలు సన్మానించారు. మండల కేంద్రంలో నిరుపేద కుటుంబాలకు చెందిన ఖలీల్ కూతురు హీనా 986 మార్కులు, రబ్బాని కూతురు అబిద తంజీద్ ప్రథమ సంవత్సరంలో 466 మార్కులు, రెహమాన్ కూతురు సానియా 980 మార్కులు సాధించారు. వీరితో పాటు పలు గ్రామాల విద్యార్థులు మీర్జా ఇక్రాన్, ఎండీ మైమున్, హాజీర మహీన్, ఆదిబా, షాపియా, షేక్ మహబూబ్‌లు ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించగా ముస్లిం పెద్దలు శాలువాలతో సత్కరించి అభినందించారు. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం హర్షనీయం అని రానున్న రోజుల్లో ఉన్నత చదువుల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ గౌసొద్దిన్, మీర్జా సిద్ధిక్ బేగ్, ఎండీ అన్వర్ హుస్సెన్, ఎండీ ఖలీల్, ఇస్మాయిల్, ఇంతియాజోద్దిన్, అబ్బాస్, రహూఫ్‌పాషా, నసీర్, జానీ, మొబీన్, బషీర్, సలీం, షేక్ బాజీ, సర్దార్, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

రేగొండలో..

రేగొండ: మండలంలోని నారాయాణపూర్ గ్రామానికి చెందిన కొత్తకొండ ఆకాంక్ష ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో ఎంపీసీ మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించింది. దీంతో విద్యార్థినికి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భలేరావు మనోహర్‌రావు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆకాంక్ష రాష్ట్ర స్థాయి మార్కులు సాధించడం నారాయణపురానికి గర్వకారణామని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భలేరావు పద్మ, కొత్తకొండ సమ్మయ్య, శ్యామరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



గొత్తికోయలతో మాట్లాడుతున్న ఎస్సై సురేష్

కన్నాయిగూడెం: గ్రామాల్లోకి అనుమానితులు వస్తే ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్సై సురేష్ తెలిపారు. శుక్రవారం ఐలాపుర్‌లో కార్డన్‌సెర్చ్ నిర్వహించి గ్రామంలో తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామ కూడలిలో గ్రామస్తులతో మాట్లాడారు. సంఘవిద్రోహ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎలాంటి సమస్యలు వచ్చిన పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఇటీవల ప్రమాదానికి గురై వైద్యం పొందుతున్న సోలం కోషయ్యకు ఆర్థిక స్తోమత బాగులేదని తెలుసుకున్న ఎస్సై రూ.3000ల ఆర్థిక సాయం అందజేశారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



దాడుల్లో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు

కాటారం: కాటారం, మల్హర్ మండలాల్లోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న గుడుంబా తయారీ కేంద్రాలపై శుక్రవారం కాటారం, భూపాలపల్లి ఎక్సైజ్ శాఖ, భూపాలపల్లి డీటీఎఫ్ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. కాటారం మండలం గంట్లకుంట, గంగారం, మల్హర్ మండలం కొయ్యూర్ తండా, అడువాలపల్లి గ్రామాల్లో దాడులు చేసి 45 లీటర్ల గుడుంబా, 50 కిలోల బెల్లం, 50 కిలోల చక్కెర స్వాధీనపర్చుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. 2900 బెల్లం పానకం ధ్వంసం చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గంగారం గ్రామానికి చెందిన సారయ్యానాయక్, నరసింహనాయక్‌ను అదుపులోకి తీసుకొని రెండు బైకలను సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. భూపాలపల్లి ఎక్సైజ్ సీఐ రమ్యరెడ్డి, డీటీఎఫ్ సీఐ రాజసమ్మయ్య, ఎక్సైజ్ ఎస్సైలు కిష్టయ్య, రబ్బాని పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వెంకటాపురం(ఎం): మండలంలోని జవహర్‌నగర్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు వెంకటాపురం ఎస్సై చల్లా రాజు తెలిపారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా సోదా చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో 50 వేల నగదు కంటే ఎక్కువ తీసుకెళ్లరాదని సూచించారు. వాహనదారులు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని, వాహన రిజిస్ట్రేషన్ కాగితాలు లేకపోతే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎస్ఎస్ తాడ్వాయి: ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి రేగ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం తాడ్వాయి మండల కేంద్రంలోని ఉపాధి పనుల్లో భాగంగా చెరువుల్లో కందకాలు తీస్తున్న కూలీలకు ఎండ నుంచి నీడ కోసం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల లోపే పనులు ముగించుకోవాలన్నారు. ఎండ ఎక్కువ ఉన్న సమయంలో పడకుండా కూలీలు గ్రీన్‌మ్యాట్ కింద విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి

గోవిందరావుపేట: కార్యకర్తలు సమష్టిగా పనిచేసి తన గెలుపునకు కృషి చేయాలని ఎంపీ, బీఆర్‌ఎస్ పార్టీ మహబుబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. మండలంలోని కమ్మ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం పార్టీ మండల ఇన్‌చార్జ్ లకావత్ నరసింహా నాయక్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల విస్తృత సాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాలోత్ కవిత హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాలోత్ కవిత మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి, ఇంతవరకు చేయలేదన్నారు. మండలంలోని ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి తనని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు, రైతు కో ఆర్డినేటర్ పిన్నింటి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత

వార్షికోత్సవానికి ఆలయం ముస్తాబు

ఏటూరునాగారం: మండలంలోని షిర్డిసాయిబాబా ఆలయాన్ని ఈనెల 29న నిర్వహించే వార్షికోత్సవానికి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ శిఖరానికి రంగులు వేశారు. కాగా, ఆ రోజు ఉదయం పంచామృత అభిషేకాలు, అష్టోత్రనామ పూజలు, అర్చనలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం హారతి, మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ తెలిపారు. విద్యుత్‌దీపాలు, తాగునీరు, క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలోని పురవీధుల్లో పల్లకి సేవ కార్యక్రమాన్ని తెలిపారు.

